క్లుప్తంగా

భానుడు ప్రతాపం



నిర్మానుష్యంగా మునగపాక బైపాస్ రోడ్డు

మునగపాక: కొద్ది రోజులుగా వరుణుడు పలకరింపుతో చల్లబడిన వాతావరణం ఆదివారం మాత్రం మళ్లీ భానుడు ప్రతాపం చూపించాడు. మండల వ్యాప్తంగా ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉక్కపోత తగ్గకపోవడంతో పిల్లలు,పెద్దలు అవస్థలు పడ్డారు. ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రత పెరిగిపోయింది. ఉదయం 11 గంటలకే మునగపాక బైపాస్ రోడ్డు నిర్మానుష్యంగా మారింది. ఎండ సుర్రుమనడంతో కొంతమంది ప్రయాణాలను సైతం వాయిదా వేసుకోవాల్సి వచ్చింది.

పచ్చిరొట్ట పంటలతో నేల సంరక్షణ



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్

పాయకరావుపేట: మండలంలోని మంగవరం, మాసాహేబుపేట గ్రామాల్లో ఆదివారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వాణిజ్య పంటల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొబ్బరిలో విత్తన ఎంపిక, తోటల యాజమాన్యం, భూసార పరిరక్షణపై అవగాహన కల్పించారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శివ మాట్లాడుతూ కొబ్బరిలో కొమ్ము పురుగు, ఎర్రముక్కు పురుగు, తెల్ల దోమ నివారణ పద్ధతులు వివరించారు. తట్టుకాయల నియంత్రణకు పొటాషియం, బోరాన్ పోషకాల ప్రాధాన్యత, ఎరువుల యాజమాన్యాన్ని తెలియజేశారు. సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా నేలకు అన్ని రకాల పోషకాలను అందించవచ్చునన్నారు. పచ్చిరొట్ట ఎరువు విత్తనాలతో నేల సంరక్షణ సాధ్యమన్నారు. వ్యవసాయంలో డ్రోన్ వినియోగం, నమో డ్రోన్ దీదీ పథకాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంగలపూడి రామారావు, ఎంపీటీసీ రామగోవిందరావు, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, మార్కెట్ కమిటీ ప్రెసిడెంట్ కంకిపాటి వెంకటేశ్వరరావు, గ్రామ అభ్యుదయ రైతులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది సాధన, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

- జిల్లా రిసోర్స్ కేంద్రం ఏడీఏ సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న జిల్లా రిసోర్స్ కేంద్రం ఏడీఏ సుబ్రహ్మణ్యం

కశింకోట: వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా రిసోర్స్ కేంద్రం ఏడీఏ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని జెట్టపురెడ్డితుని, నూతలగుంట పాలెం గ్రామాల్లో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి నారు వేసుకునేటప్పుడు శుద్ధి చేసిన విత్తనాలు నాటుకోవాలన్నారు. నాట్లు వేసినప్పుడు కాలి బాటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉద్యానవన విస్తరణాధికారి ప్రవీణ మాట్లాడుతూ ఉద్యానవన పంటల సాగుకు బిందు సేద్యం లాభదాయకంగా ఉంటుందన్నారు. మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. బీసీటీ కృషి కేంద్రం భూసార పరీక్ష శాస్త్రవేత్త బి.శ్రీహరిరావు మాట్లాడుతూ రైతులు సహజ సిద్ధమైన ఎరువులు వినియోగించి పంటలు సాగు చేయాలన్నారు. దీనివల్ల భూమి ఆరోగ్యవంతంగా ఉండటంతోపాటు ఆరోగ్యకర ఉత్పత్తులు ప్రజలకు అందుతాయన్నారు. పశు వైద్య శాస్త్రవేత్త విజయ రాజ్ఞి మాట్లాడుతూ పశుగ్రాసం సాగులో యూరియా ఎరువు శాతాన్ని తగ్గించి జీవన ఎరువులు, పశువులు గెత్తం ఉపయోగించాలని రైతులకు సూచించారు.

కోటమ్మతల్లి పండగకు ఘనంగా ఏర్పాట్లు

నాతవరం : కోటమ్మ తల్లి పండగ మహోత్సవం ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. కోటమ్మతల్లిని నాతవరం గ్రామస్తులు పూర్వం నుంచి గ్రామదేవతగా పూజిస్తున్నారు. ఈ అమ్మవారి పండగను మూడేళ్లకోసారి జరుపుకోవడం ఆనవాయితీ. ఈనెల 3న పండగ చేసేందుకు వేదపండితులు గ్రామపెద్దలు నిర్ణయించారు. ఇప్పటికే పండగ సందర్భంగా క్రికెట్, షటిల్ ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. గ్రామమంతా విద్యుత్‌తో అలంకరించారు. సోమవారం నుంచే గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఇటుక.. కుదేలిక.!



నీలాద్రిపురం వద్ద ఇటుక పరిశ్రమ



పరిశ్రమలో కొత్త ఇటుక తయారు చేస్తున్న దృశ్యం



గత ఏడాది విక్రయానికి సిద్ధం చేసిన ఇటుకలు

- నిర్మాణాలు లేక ఇటుక పరిశ్రమ డీలా
- తగ్గిన డిమాండ్‌తో కార్మికుల అవస్థలు
- తాజాగా దెబ్బతీసిన అకాల వర్షాలు

ఎస్.రాయవరం: ఇటుక పరిశ్రమ కుదేలైంది. కూటమి పరిశ్రమ వచ్చాక నిర్మాణాలు అంతంత మాత్రంగా ఉండడంతో ఇటుకకు డిమాండ్ తగ్గింది. దీంతో బేరాలు లేక ఇటుక బట్టీల నిర్వాహకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మరో వైపు ఇటీవల కురిసిన వర్షాలు ఇటుక పరిశ్రమను తీవ్ర నష్టాల్లోకి నెట్టాయి. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి బోణి లేక ఇటుక అంతా నిల్వ ఉండిపోయింది. ఇప్పుడు వేసవిలో కొత్త ఇటుక తీసే లోపు అకాల వర్షాలు ఆటంకంగా మారాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగడంతో ఇటుకల వ్యాపారం బాగుండేది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదు. దీంతో నిర్మాణాలు ఎక్కడా చేపట్టకపోవడంతో ఇటుక నిల్వలు ఎక్కడికక్కడ పేరుకుపోయాయి.

మండలంలో 18 మంది ఇటుక పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడి నుంచి ఎస్.రాయవరం, యలమంచిలి, కోటవురట్ల, నక్కపల్లి మండలాలకు ఇటుక సరఫరా చేస్తుంటారు. ఇప్పుడు ఏడాది కాలంగా ఇటుకల వ్యాపారం లేక, ఇటుక తయారు చేసే వారికి చెల్లింపులు చేయలేక నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు రూ.20 లక్షల వరకు పెట్టుబడి పెట్టి ఇటుక పరిశ్రమ నిర్వహిస్తుంటారు. గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు పెద్ద ఎత్తున చేపట్టడంతో ఇటుకలకు డిమాండ్ ఉండేది. వ్యాపారులు అధిక సంఖ్యలో ఇటుక పరిశ్రమలు ఏర్పాటు చేసి ఇటుకలను సిద్ధం చేశారు. వ్యాపారం కూడా బాగా సాగింది. అయితే ఇప్పుడు ఇళ్ల నిర్మాణాలు పూర్తిగా ఆగిపోవడం.. కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా కొత్తగా ఇళ్లు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటుక పరిశ్రమ ఏర్పాటు చేసుకున్నవారికి ముడిసరకు ప్రధానంగా చెరువు మట్టి. ఆ మట్టి తీసుకునేందుకు కూడా ప్రభుత్వం నుంచి అనుమతులు లేవు. అక్రమ మార్గంలో తీసుకున్న మట్టికి అధిక ఖర్చు అవుతోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సీజన్‌లో తయారు చేసిన ఇటుకలను కొనుగోలు చేసే వారు లేక ఎక్కడికక్కడ నిల్వలు పేరుకుపోయాయి. పెట్టిన పెట్టుబడికి తగ్గట్టు ఇటుకకు డిమాండ్ లేక నిర్వాహకులు సతమతమవుతున్నారు.

10 నెలలుగా బేరాల్లేవు..



గత 10 నెలలుగా ఇటుకల వ్యాపారం పూర్తిగా పడిపోయింది. కొత్తగా నిర్మాణాలు లేక ఇటుకకు బేరాలు లేవు. కొద్ది రోజులు ఆగితే పాత ఇటుకను కొనుగోలు చేసే నాథుడు కూడా లేరు. గతంలో జగనన్న కాలనీలు నిర్మాణాలు జోరుగా సాగడంతో ఎక్కువగా ఇటుక విక్రయాలు సాగాయి. కొత్త ప్రభుత్వం వచ్చాక వ్యాపారం లేక పరిశ్రమ నిర్వహణ ఇబ్బందికరంగా మారింది.

– బోసు, ఇటుక పరిశ్రమ నిర్వాహకుడు, చెల్లాపురం

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



డీఆర్‌డీవో శాస్త్రవేత్త దుర్గా ప్రసాద్‌ను సత్కరిస్తున్న గవర్ల అనకాపల్లి గ్రాడ్యుయేట్స్ క్లబ్ సభ్యులు

మునగపాక: విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని డీఆర్‌డీవో శాస్త్రవేత్త పేర్ని దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని గవర్ల అనకాపల్లిలో గ్రాడ్యుయేట్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రాయింగ్, కంప్యూటర్ శిక్షణ, భగవద్గీత పఠనం, మెదడుకు పదును పెట్టే పలు అంశాలపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఇటువంటి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలన్నారు. లక్ష్యం కోసం కష్టపడి చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డి.శ్రీధర్, రవితేజ, ఆళ్ల ప్రసాద్, వెంకటేష్, రవికుమార్, అంగలూరి రామకృష్ణ, ఆళ్ల నాగేశ్వరరావు, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి పండగ



ఊరేగింపుగా వస్తున్న రైతు కుటుంబాలు

మునగపాక: మునగపాకలో ఆదివారం సత్తెమ్మతల్లి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. చెరువు కాలువ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పండగలో పలువురు రైతులు తమ కుటుంబాలతో డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- 4న 'వెన్నుపోటు దినం'కు తరలిరావాలి
- వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త ధర్మశ్రీ పిలుపు
- ప్రాణమున్నంత వరకు వైఎస్సార్‌సీపీతోనే..: కన్నబాబు



వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరిస్తున్న కరణం ధర్మశ్రీ, కన్నబాబురాజు, శోభా హైమావతి

అచ్యుతాపురం రూరల్: కూటమి ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పరిశీలకురాలు శోభా హైమావతి పిలుపునిచ్చారు. ఆదివారం కొండకర్లలోని అతిథి గృహంలో పార్టీ సమన్వయకర్త కన్నబాబురాజు అధ్యక్షతన ఆదివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న 2.0లో భవిష్యత్తు రాజకీయాలన్నీ కార్యకర్తల కేంద్రంగానే నడుస్తాయని, దీనికి జగనే భరోసా కల్పించారన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసి, రానున్న కాలంలో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ నెల 4న తలపెట్టిన 'వెన్నుపోటు దినం'ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు మాట్లాడుతూ రానున్న కాలంలో కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గం స్థాయి వరకూ వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా ఏకమై ఈ నెల 4న జరిగే వెన్నుపోటు దినంను విజయవంతం చేద్దామన్నారు. కూటమి ఏడాది పాలన మోసాలను ఎండగడదామని పిలుపునిచ్చారు. కంఠంలో ప్రాణమున్నంత వరకు వైఎస్సార్‌సీపీతోనే తన ప్రయాణమని కన్నబాబురాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాత, ఎంపీపీ కోన సంధ్య బుజ్జీ, పార్టీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, జెడ్పీటీసీ లాలం రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ



వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగులు, తదితరులు

ఎస్.రాయవరం: కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ఎండ గట్టేందుకు వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు చేపట్టబోయే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు కోరారు. ఈ మేరకు అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పుడు వచ్చినా మార్పు ఉండదని, కూటమిలో ప్రభుత్వం చేస్తున్న మోసాలు ఏడాదిలోనే తేటతెల్లమయ్యాయన్నారు. ఇకపై కార్యకర్తల చేతుల మీదుగా ప్రతి కార్యక్రమం నడుస్తుందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.రాయవరం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువర్మ, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు, వాకపాడు సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్ వియ్యపు సింహాద్రి, జిల్లా గ్రీవెన్స్ కన్వీనర్ సూరకాసుల గోవిందు, రామచంద్రపురం మాజీ సర్పంచ్ గెంజి రమణ, పార్టీ నాయకులు పొలుమూరు అప్పలరాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కష్టాలు.. మళ్లీ మొదలు.!

- ఎండీయూ వ్యవస్థ రద్దుతో లబ్ధిదారుల అవస్థలు
- తొలి రోజే డిపోల వద్ద జనం పడిగాపులు
- పలు చోట్ల మొరాయించిన మిషన్లు



కోటవురట్ల మండలంలో డిపో వద్ద సరకుల కోసం గుమిగూడిన కార్డుదారులు

నక్కపల్లి: తెల్ల కార్డుదారులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరకులు తీసుకునేందుకు పడిగాపులు పడాల్సిందే. గత ప్రభుత్వం అమలు చేసిన ఎండీయూ ఆపరేటర్ల వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నెల నుంచి ఇంటింటికి వెళ్లి నిత్యావసర సరకుల పంపిణీ విధానానికి స్వస్తి పలికింది. రేషన్ డిపోల వద్దకు వెళ్లి నిత్యావసర సరకులు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో లబ్ధిదారులు ఉసూరమంటూ డిపోల వద్దకు వెళ్లి గంటల తరబడి క్యూలో నిల్చుని సరకులు తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానం సత్ఫలితాలు ఇచ్చింది. డిపో పరిధిలో దూరంగా ఉన్న గ్రామాల ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఐదేళ్ల పాటు నిరాటంకంగా ఈ కార్యక్రమం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం ప్రజల కోసం చేపట్టిన పథకాలను, కార్యక్రమాలను ఒక్కొక్కటిగా రద్దు చేస్తూ వస్తోంది. వలంటీర్ల వ్యవస్థ రద్దు, ఇంటింటికి వెళ్లి పింఛను అందజేయడంతో పాటు తాజాగా రేషన్ సరకులు ఇళ్ల వద్దే పంపిణీ చేసే విధానాన్ని కూడా రద్దు జాబితాలో చేర్చింది. డిపోల వద్దకు వెళ్లి సరకులు తెచ్చుకోవాల్సిందేనంటూ స్పష్టం చేయడంతో ఆదివారం నుంచి కార్డుదారులకు కష్టాలు మొదలయ్యాయి. డిపోల వద్ద నిత్యావసర సరకుల కోసం కార్డుదారులంతా క్యూకట్టారు. ఇదేదో మంచి కార్యక్రమం ప్రజలకు ఉపయోగపడేదీ అన్నట్లు కూటమి నాయకులు ఆదివారం డిపోలో సరకుల పంపిణీని అట్టహాసంగా ప్రారంభించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సరకులు తెచ్చుకునేందుకు మండుటెండలో డిపోల వద్ద పడిగాపులు పడాల్సి వస్తోందంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పలు డిపోల్లో మిషన్లు సరిగా పని చేయలేదు. నెట్‌వర్క్ లేక తరచూ మొరాయించాయి. గ్రామంలో ఉన్న డిపోలు కార్డుదారుల ఇళ్లకు దూరంగా ఉంటున్నాయి. శివారు గ్రామాల్లో ఉన్నవారు, బీసీ, ఎస్సీ, తదితర ప్రత్యేక కాలనీల్లో నివసించేవారు డిపోల వద్దకు వెళ్లి సరకులు తెచ్చుకునేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. నక్కపల్లి మండలంలో సుమారు 68 వరకు రేషన్ డిపోలున్నాయి. తొలిరోజు దాదాపు పది డిపోల్లో మెషిన్లు మొరాయించాయి. వాటిని మండల కేంద్రానికి తీసుకెళ్లి మరమ్మతులు చేయించి మధ్యాహ్నం నుంచి సరకుల పంపిణీ మొదలు పెట్టారు.

ఇదేం పెబుత్వం.. ఏంసేత్తన్నారో తెలీదు..



ఎంచక్కా రేషన్ సరకులు ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చేవారు. ఇదేంటో ఈ నెల నుంచి కోటాకాడికెళ్లి తెచ్చుకోమంటున్నారు. సానా ఇబ్బంది పడతాం. పోలోమని వచ్చేత్తన్నారు. ఎంతోసేపుండాల, వ్యాన్‌లో తెచ్చి ఇచ్చేవోరు బాగానే ఉంది. మళ్లీ ఏమొచ్చింది. దాన్ని తీసేశారు. సరకులు సరిగా ఇవ్వకపోతే తీసేసినా పర్వానేదు. బాగా ఇచ్చేటప్పుడు ఎందుకు తీసేయాల, ఇదేం పెబుత్వం. మా వీధిలోకి మా ఇంటి ముందుకు వ్యాన్ వచ్చేది. పిలిచి సరుకులు ఇచ్చేసి పోయేవారు. ఈ పెబుత్వం వచ్చాక ఏంసేత్తన్నారో, ఎలా సేత్తన్నారో అర్థం కావడంలేదు. కూలిపనులు మానుకుని కోటా సరుకుల కోసం ఎళ్లాల్సి వస్తుంది.

– త్రివేణి, నాగరత్నం, లబ్ధిదారులు

ఏడాది పాలనకు బహుమతి.. రేషన్ కష్టాలు



చౌడువాడలో రేషన్ కోసం వేచి ఉన్న మహిళలు

కోటవురట్ల: రేషన్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. పేద, మధ్యతరగతి ప్రజలు తిండి గింజల కోసం మళ్లీ క్యూ కట్టాల్సిన పరిస్థితులు మొదలయ్యాయి. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల ఇంటికే సమస్త సేవలతో పాటు రేషన్ సరుకులు చేరేలా పథకాలను అమలు పరిచారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్న సమయంలో రాష్ట్ర ప్రజలకు రేషన్ కష్టాలను బహుమతిగా అందించడం ప్రారంభించింది. మండలంలో ఆదివారం రేషన్ దుకాణాలు తిరిగి ప్రారంభమయ్యాయి. మొదటి రోజునే పలు ప్రాంతాలలో జనం క్యూకట్టారు. మహిళలు రేషన్ కోసం పడిగాపులు కాయడం ప్రారంభించారు. చౌడువాడ, కైలాసపట్నం, జల్లూరు తదితరు పలు ప్రాంతాలలో రేషన్ కోసం క్యూ ప్రారంభమైంది.

యోగా ఆరోగ్య ప్రదాయిని



కోటవురట్లలో యోగా చేస్తున్న అధికారులు, సచివాలయ సిబ్బంది



ఉపమాక దేవస్థాన ప్రాంగణంలో యోగా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కోటవురట్ల: యోగా ఆరోగ్య ప్రదాయిని అని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యోగా ట్రైనర్ పోలిరెడ్డి శ్యామ్‌కుమార్ యోగాసనాలు వేయిస్తూ యోగా వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో యోగా తప్పనిసరన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందన్నారు.

నక్కపల్లి: యోగా ఒక వరమని, సంపూర్ణ ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో అవసరమని ఎంపీడీవో సీతారామరాజు పేర్కొన్నారు. ఆదివారం ఉపమాక దేవస్థాన ప్రాంగణంలో యోగాంధ్ర–2025 కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సిబ్బందికి యోగాలో శిక్షణ ఇచ్చారు. మానసిక ఒత్తిడిని జయించేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీడీవో చెప్పారు. ప్రోటోకాల్ యోగా కార్యక్రమంలో భాగంగా ఐదు రోజులు వివిద శాఖల సిబ్బందికి ఉపమాకలో యోగాపై శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో యోగా ఇన్‌స్ట్రక్టర్లు రాంబాబు, ఆదిత్యరుత్విక్, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో రూ.లక్ష ఆస్తి నష్టం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అనకాపల్లి: స్థానిక రావుగోపాలరావు కళాక్షేత్రం రహదారిలో పాత ఇనుప సామగ్రి దుకాణంలో ఆదివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించింది. గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ పీక కాల్చిపారేయడంతో ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నామని అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. రూ.లక్ష ఆస్తినష్టం జరిగినట్లుగా నివేదిక ఇచ్చారు. ప్రమాదంతో తీవ్రంగా నష్టపోయిన దుకాణ యజమాని టేకు సత్తిబాబు బోరున విలపించాడు. కార్యక్రమంలో అగ్నిమాపక ఉద్యోగులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ పండగకు పారిశుధ్య చర్యలు

మాడుగుల: ఈ నెల 3వ తేదీన జరగనున్న మాడుగుల మోదకొండమ్మ పండగ సందర్భంగా డీపీవో శిరీషారాణి, డీఎల్‌పీవో మూర్తి పారిశుధ్యంపై అధికారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. పండగ సందర్భంగా గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచాలని పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం గ్రామంలో తిరిగి, ఏర్పాటు చేస్తున్న వైద్యశిబిరాలు, మంచినీటి ఏర్పాట్లతో పాటు పారిశుధ్య పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు ఎంపీడీవో అప్పారావు పాల్గొన్నారు.

చదరంగంపై శిక్షణ



చదరంగం ఆటపై అవగాహన కలిగిస్తున్న ఉపాధ్యాయుడు మళ్ల కోటేశ్వరరావు

కశింకోట: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చదరంగంపై శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయుడు మళ్ల కోటేశ్వరరావు ఈ సందర్భంగా చదరంగం ఆటలో మెలకువలు, ఆటాడే తీరును వివరించారు. గ్రంథాలయ అధికారి వరలక్ష్మి, విశ్రాంత ఉపాధ్యాయుడు వై. రామచంద్రరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో జనరల్ నాలెడ్జ్ గురించి గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం వివరించారు. జనరల్ నాలెడ్జ్ చదవడం, నేర్చుకోవడం వల్ల పోటీ పరీక్షలకు ఉపయోగపడనున్నట్లు తెలిపారు.

పరదేశిరావు కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక



మునగపాకలో ఆత్మీయ సమావేశమైన పరదేశిరావు కుటుంబ సభ్యులు

మునగపాక: మునగపాకకు చెందిన దివంగత వెలగా పరదేశిరావు కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక చెరువు కాలువ దరి వెలగా వారి కళ్లాల వద్ద ఆదివారం జరిగింది. పరదేశిరావు కుమారులు, కోడళ్లు, కుమార్తెలు, అల్లుళ్లు, మనుమలు, మనుమరాళ్లు, మునిమనుమలు ఇలా 42 మంది వరకు హాజరై ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో సంతోషంగా గడిపారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న వారంతా వారి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ తీపి జ్ఞాపకాలను మరువలేమంటూ వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.